## క్లుప్తంగా

### శ్రీకృష్ణుని గ్రామోత్సవం



పల్లకీ మోస్తున్న నూతన వధూవరులు

**బత్తలపల్లి:** మండలం కేంద్రం బత్తలపల్లిలోని బీసీ కాలనీలోని జగలేటి నాగమణి, నాగేంద్ర ఇంటి వద్ద జన్మాష్టమి సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఐదు రోజులుగా పూజలందుకున్న శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాలతో బుధవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. నూతన వధూవరులు జగలేటి ప్రశాంత్ కుమార్, శ్యామల పల్లకీ మోశారు.

**ముదిగుబ్బ:** త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ముదిగుబ్బ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమతో గ్రామోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీఐలు శివరాముడు, శ్యామరావు, తహసీల్దార్ నారాయణస్వామి, తదితరులు హాజరై స్వామి వారి పల్లకీ మోశారు.

### పరిశుభ్రతతోనే ఆరోగ్యం

**ఎన్పీకుంట:** మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మన ఆరోగ్యాన్ని కాపాడుకున్నట్లే అని వైద్యాధికారి బాలాజీ నాయక్, డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి సూచించారు. గొకనపేటలోని హరిజనవాడలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ కె.మహేశ్వరరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### పోలీసుల నిఘా పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి

**కదిరి అర్బన్:** గ్రామాలు, విద్యాసంస్థల పరిసరాల్లో మత్తుపదార్థాలు విక్రయించేవారిపై పోలీసులు నిఘా పెంచాలని ఎంపీపీ అమరనాథ్ రెడ్డి కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ రాధాబాయి, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల మండలంలో జరుగుతున్న దుర్ఘటనలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. యువత పెడదోవ పట్టకుండా ఉండడానికి గ్రామ పోలీసులు బాధ్యతగా పని చేయాలని కోరారు. అలాగే వరుసగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా తాగునీటి పైప్‌లైన్‌లు కలుషితం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం వివిధ శాఖల్లో అమలు చేస్తున్న పథకాలను అధికారులు తెలియజేశారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

### హోమియోపతి మాత్రల పంపిణీ

**పుట్టపర్తి అర్బన్:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా విద్యార్థులకు హోమియోపతి మాత్రలు అందజేసినట్లు హోమియోపతి వైద్యశాల డాక్టర్ అర్చనయోగేష్ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మలేరియా నివారణకు దోహదపడే హోమియోపతి మాత్రలు పంపిణీ చేశారు.

### గోపుర కలశ ప్రతిష్ట

**ముదిగుబ్బ:** మంగళమడక గ్రామంలో రెండు రోజులుగా ప్రసన్న ఆంజనేయస్వామి మహా గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ధ్వజస్తంభ, గోపుర కలశ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తజన మండలి ఆధ్వర్యంలో భజనలు చేపట్టారు. మహాస్థాపనం, హోమాలను నిర్వహించారు.

### అటవీ గ్రామాల్లో తనిఖీలు

**పుట్టపర్తి అర్బన్:** మండలంలోని అటవీ ప్రాంతాలైన గంగిరెడ్డిపల్లి, దిగువచెర్లోపల్లి, సాతార్లపల్లి గ్రామాల్లో పోలీస్ అధికారులు బుధవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ సురేష్, ఎస్ఐలు లింగన్న, కృష్ణమూర్తి సిబ్బంది పాల్గొని షాపులు, గడ్డివాములు, వాహనాలతో పాటు పలు ఇళ్లల్లో సోదాలు చేశారు. అనంతరం ప్రజలను సమావేశ పరిచి ఎక్కడైనా గొడవలు, దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

### నాణ్యమైన విద్య అందించండి

**ధర్మవరం అర్బన్:** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అందరూ కృషి చేయాలని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సలీంబాషా సూచించారు. పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, హాస్టల్ వసతులు, ఐఐటీ, నీట్, విద్యా శక్తి క్లాసులు తదితర వాటి గురించి విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. విద్యా సామర్థ్యాలనూ పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వెరిఫికేషన్‌తో ఏడిపింఛన్



హిందూపురం ఆస్పత్రిలో వైకల్య శాతం వెరిఫికేషన్ కోసం వేచి ఉన్న ధర్మవరం నియోజకవర్గ దివ్యాంగులు



పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు దివ్యాంగులు, వారి సహాయకుల అవస్థలు



- ధర్మవరం నియోజకవర్గ దివ్యాంగులకు హిందూపురంలో వైకల్య పునఃపరిశీలన
- వంద కిలోమీటర్ల దూర ప్రయాణానికి ఆపసోపాలు

**ధర్మవరం:** దివ్యాంగ పింఛన్ లబ్ధిదారులకు కష్టాలు కొనసాగుతున్నాయి. వైకల్య శాతం వెరిఫికేషన్‌ను ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేయకుండా వంద కిలోమీటర్లకుపైగా దూరమున్న హిందూపురం ఆస్పత్రికి వెళ్లాలని అధికారులు సూచించడంతో ఆపసోపాలు పడుతూ అక్కడికి చేరుకోవాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారి వైకల్య శాతాల పునఃపరిశీలనకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసింది. అందులో భాగంగా ధర్మవరం నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఆరునెలల క్రితం ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలో క్యాంపులు నిర్వహించారు. ఈ క్యాంపులకు వెళ్లని 124 మంది పింఛనుదారులకు చివరి అవకాశంగా హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి బుధవారం వెళ్లాలని సంబంధిత అధికారులు సూచించారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా ధర్మవరం అర్బన్ నుంచి 43, రూరల్ నుంచి 36, బత్తలపల్లి మండలం నుంచి 36, ముదిగుబ్బ నుంచి ఏడుగురు, తాడిమర్రి నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 124 మంది దివ్యాంగులు తమ వైకల్య శాతం పునఃపరిశీలన కోసం వెళ్లడానికి పడరానిపాట్లు పడ్డారు. ఆటోలు, బస్సులు, ప్రైవేటు వాహనాలు ఇలా పలు రకాల వాహనాల్లో నడవలేని నిస్సహాయులు సైతం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ నియోజకవర్గంలోని పింఛనుదారులకు వంద కిలోమీటర్లపైన ఉన్న హిందూపురం ఆస్పత్రికి పంపించాల్సిన అవసరం ఏముందంటూ పలువురు దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతగా కష్టపెట్టాలా అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు.

## భక్తిశ్రద్ధలతో గణపతి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట



గణపతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని చెలిమి సీతారామాంజనేయ ఆలయంలో గణపతి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడురోజులపాటు సాగిన మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చెలిమి జీర్ణోద్ధరణ సంఘం, మహిళా మండలి ఆధ్వర్యంలో స్వామికి వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు, ప్రాణప్రతిష్టతోపాటు హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలను వేదమంత్రాల నడుమ నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శ్రీనివాసులు, సుందరేష్, లక్ష్మీనాథ్, రంగనాయకులు, వెంకట నరసింహులు, హేమంత్‌కుమార్, అర్చకులు మోహన్‌స్వామి, చంద్రమౌళి స్వాములు పాల్గొన్నారు.

## దివ్యాంగుల పింఛన్ల రద్దు అన్యాయం



ఎంపీడీఓను కలిసేందుకు దివ్యాంగుడిని తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు

**బత్తలపల్లి:** దివ్యాంగుల పింఛన్ల రద్దుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అక్కిం నరసింహులు పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ నరసింహనాయుడును కలిసి దివ్యాంగుల పింఛన్ల రద్దుపై పునరాలోచన చేయాలని, అర్హులకు న్యాయం చేయాలని కోరారు. బత్తలపల్లికి చెందిన అక్కిం మహేష్, రాములమ్మ దంపతుల కుమారుడు అంజన్‌కుమార్ పుట్టకతో దివ్యాంగుడని, కుమారునికి సేవలు చేసుకుంటూ తల్లిదండ్రులు కూలికి పోకుండా ఇంటి దగ్గరే ఉండాల్సిన పరిస్థితి ఉందని అలాంటి వారి పింఛన్‌ను ఎలా తొలగించారంటూ ఎంపీడీఓ దృష్టికి తీసుకువెళ్లి వినతి పత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలో వెరిఫికేషన్ చేయకుండానే వైకల్య పరీక్షలు పూర్తి చేసినట్లు తప్పుడు నివేదికలు పొందుపరిచారన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి నియోజకవర్గంలోనే వైద్యులు ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరించడాన్ని తప్పు పట్టారు. తక్షణమే సదరు వైద్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

## ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండండి

**బత్తలపల్లి:** ప్రయాణ సమయంలో విలువైన వస్తువులు అపహరణకు గురికాకుండా ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ ఆదేశాల మేరకు బత్తలపల్లి ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు నరేష్, పెద్దన్న, హోంగార్డు బాలనాయుడు తదితరులు బస్సుల కోసం వేచి చూస్తున్న మహిళలు, ప్రయాణికులు తమ బ్యాగులలో ఉంచుకున్న విలువైన వస్తువులు, సెల్‌ఫోన్ తదితర వాటిని అపరచిత వ్యక్తులు ఏమార్చి చోరీలకు పాల్పడతారని, అటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## ‘తూకాల్లో వ్యత్యాసం ఉండకూడదు’



రేషన్‌షాపులో ఆరా తీస్తున్న ఆర్డీఓ మహేష్

**చెన్నేకొత్తపల్లి:** మండల కేంద్రంలోని 11వ నంబర్ చౌకధాన్యపు డిపోను ఆర్డీఓ మహేష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రికార్డును పరిశీలించి, కార్డుదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. డిపో పరిధిలో ఎన్ని కార్డులు ఉన్నాయి? ఎంత స్టాక్ వస్తుందని చౌకధాన్యపు డిపో డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. తూకాల్లో వ్యత్యాసం లేకుండా సరుకులను కార్డుదారులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ కుమార్, సీఎస్‌డీటీ గురు ప్రసాద్, వీఆర్ఓ నారాయణ స్వామి పాల్గొన్నారు.

## బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమిస్తాం

**ధర్మవరం:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల అనుమతి లేకుండా కార్పొరేట్ కంపెనీల కోసం చేపట్టే బలవంతపు భూసేకరణను ఆపకపోతే ఉద్యమిస్తామని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరు జిల్లా కరేడు గ్రామంలో ఇండోసోల్ కార్పొరేట్ కంపెనీ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కరేడు గ్రామ రైతులను అరెస్టు చేయడం దారుణమని విమర్శించారు. సత్యసాయి జిల్లాలో సోలార్ ఏపీఐఐసీ కోసం దాదాపు 60వేల ఎకరాలతోపాటు ఎన్‌పి కుంట, మిందూపురం, మడకశిర, రొద్దం ప్రాంతాలలో బలవంతపు భూసేకరణ చేశారని తెలిపారు. భూసేకరణ ఆపకపోతే రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్‌హెచ్ బాషా, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, అయూబ్‌ఖాన్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సీహెచ్‌సీలో తొలి సిజేరియన్

**నల్లమాడ:** మండల కేంద్రం నల్లమాడలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో బుధవారం తొలి సిజేరియన్ ఆపరేషన్ నిర్వహించారు. గోరంట్ల మండలం రెడ్డిచెరువుపల్లికి చెందిన మహేశ్వరి అనే గర్భిణి రెండో కాన్పు కోసం నల్లమాడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేరింది. తొలి కాన్పు కూడా సిజేరియన్ కావడంతో రెండో కాన్పు కూడా అలాగే చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ఇక్కడ సాధారణ ప్రసవాలు మాత్రమే జరిగాయి. గర్భిణి పరిస్థితి దృష్ట్యా బుధవారం అనస్తీషియా వైద్య నిపుణులు డాక్టర్ బాబ్జాన్, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ అస్తరున్నీసా, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సాయికుమార్ సీ-సెక్షన్ ద్వారా పండంటి ఆడబిడ్డను బయటకు తీశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. ఆపరేషన్‌లో హెడ్‌నర్స్ సావిత్రమ్మ, స్టాఫ్ నర్స్ విజయ, సులోచన, టెక్నీషియన్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## మోసం చంద్రబాబు నైజం



కడపలవాండ్లపల్లిలో క్యూర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**నల్లచెరువు:** ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం .. అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మోసగించడం చంద్రబాబుకు అలవాటుగా మారిపోయిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం మండల పరిధిలోని మద్దిమడుగు, తవళంమర్రి పంచాయితీలోని కడపలవాండ్లపల్లి గ్రామాల్లో మండల కన్వీనర్ ఆధ్వర్యంలో ‘బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ’ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ అంజినమ్మ, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, ఎం.క్రిష్ణారెడ్డి ఆయా పంచాయతీలలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి ప్రజలకు కూటమి ప్రభుత్వం పథకాలు అమలు చేయకుండా ఎంతమేర నష్టం చేకూర్చిందో వివరించారు. మండల కన్వీనర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలను ఇచ్చారన్నారు. అందులో రెండు మూడు, అవీ అరకొరగా అమలు చేసి.. మిగిలిన వాటి ఊసెత్తడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ వైస్ కన్వీనర్ రఫీ, సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, కె.రమణారెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణ, డైరెక్టర్లు ఆదిమూర్తి, గోవిందురెడ్డి, మాజీ సర్పంచ్ అక్బర్, ఎస్టీసెల్ కన్వీనర్ హైటెక్ రమణ, కార్యదర్శులు లక్ష్మీపతి, సలీం, బీసీ కన్వీనర్ చిన్నపల్లి హరి, సూర్య శేఖర్‌రెడ్డి(జేసీబీ), నాయకులు ఎం.రఘునాథరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కె.సహదేవరెడ్డి, శ్రీనివాసులు, మహేశ్వర్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, జయచంద్రారెడ్డి, రామిరెడ్డి, బీరప్ప, రామకృష్ణ, రామస్వామి, శంభు ప్రసాద్, శివారెడ్డి, గంగప్ప, నరసింహులు, ఆంజనేయులు, గోపాల్, రామకృష్ణ, జయచంద్రారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సిద్దారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఉత్తమరెడ్డి, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ‘రాజీ కాకపోతే చంపుతామని బెదిరిస్తున్నారు’

**కదిరి టౌన్:** తనపై హత్యాయత్నానికి పాల్పడిన వారిలో శివ, పవన్ అనే వ్యక్తులు కేసు రాజీ కాకపోతే చంపుతామని ఫోన్‌లో బెదిరించారని పట్టణంలోని దేవళం బజార్‌కు చెందిన సాయికిషోర్ బుధవారం రాత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శివ, పవన్‌పై రౌడీ షీట్ ఓపెన్ చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. వీరిపై ఇదివరకే కేసులు ఉన్నాయని, పరారీలో ఉన్న వీరి ప్రవర్తనలో ఎటువంటి మార్పు లేదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ పెట్టి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఆగ్రహం

**ఎన్పీకుంట:** మండలంలోని సచివాలయ ఉద్యోగుల పనితీరుపై డీఎల్‌డీఓ వెంకటరత్నం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం ఆయన సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పీఏఐ 2.0)కు సంబంధించి మండలంలోని 14 పంచాయతీల్లో 5 పంచాయతీల్లో మాత్రమే పూర్తి చేశారని, మిగిలిన చోట్ల ఎందుకు పూర్తి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పని చేయడం ఇష్టం లేకుంటే వేరే జిల్లాలకు బదిలీ చేయించుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. బలిజపల్లి పంచాయతీలో ఈ- చలాన్ నిధులు ఎందుకు జమ చేయలేదని, మండల వ్యాప్తంగా రూ.32వేలు జమ చేయలేదని, ఇలా అయితే పంచాయితీలకు నిధులు ఎలా సమకూర్చాలని ప్రశ్నించారు. ఇక వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు విధుల గురించి ప్రశ్నిస్తే ఏ ఒక్కరూ సమాధానం చెప్పకపోవడంతో ఆయన మండిపడ్డారు. పనితీరు సరిగా లేని ఇద్దరు ఉద్యోగులను సరెండర్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి, సిబ్బంది జకావుల్లా, సురేష్, నాగేంద్రసింగ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గేటు దాటని ‘అవగాహన’



ఆస్పత్రి ఆవరణలోనే గ్రూపు ఫొటోతో వైద్య సిబ్బంది ఇలా..

**ఎన్పీకుంట:** ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలి. ర్యాలీ నిర్వహించడం.. దోమల నివారణ నినాదాలు చేయడం, జాగ్రత్తలు వివరించడం చేయాలి. అయితే మండల కేంద్రం ఎన్పీకుంటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు ఆ కార్యక్రమాన్ని తేలికగా తీసుకున్నారు. ఫ్లెక్సీ పట్టుకుని వైద్య సిబ్బంది, ఆశాలతో కలిసి ఆస్పత్రి ఆవరణలోనే గ్రూపు ఫొటో తీసుకుని.. కార్యక్రమాన్ని ‘మమ’ అనిపించారు.

## దోమకాటు ప్రమాదకరం

**తనకల్లు:** దోమకాటు అత్యంత ప్రమాదకరమని కొక్కంటి ప్రాథమికారోగ్య కేంద్రం వైద్యాధికారి లోకేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొక్కంటి, స్థానిక కేజీబీవీలో బుధవారం దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడారు.

**ధర్మవరం అర్బన్:** దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్ తెలిపారు. పట్టణంలో బుధవారం దోమల నివారణ దినోత్సవంపై వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశాలతో ర్యాలీ నిర్వహించారు.

**తాడిమర్రి:** దోమల ఉత్పత్తిని అరికడుదాం–దోమల వల్ల వ్యాపించే వ్యాధులను నివారిద్దామని వైద్యాధికారులు హరిత, గోవర్ధన్ నాయుడు సూచించారు. ప్రపంచ దోమల దినోత్సవం పురస్కరించుకుని వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలసి బుధవారం వారు పీహెచ్‌సీ నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు.

**గాండ్లపెంట:** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండగలమని వైద్యాధికారి మహేశ్వరమారుతి తెలిపారు. బుధవారం కటారుపల్లి కేజీబీవీలో దోమల దినోత్సవంపై వైద్యాధికారి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఎస్ఓ దుర్గా, సీహెచ్ఓ నాగేష్, హెచ్ఈఓ విజయ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ రష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**ముదిగుబ్బ:** దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ముదిగుబ్బ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ శ్వేత, డాక్టర్ రాజేంద్ర ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ సరస్వతమ్మ, పీహెచ్ఎన్ లలితమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### నేడు ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’

**కదిరి అర్బన్:** మండలంలోని వరిగిరెడ్డిపల్లి, కొండమనాయునిపాళెం, చిగురుమానుతండా, చవిటితండా గ్రామాల్లో గురువారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’ కార్యక్రమం ఉంటుందని మండల కన్వీనర్ మణికంఠనాయక్ పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

### ‘అక్షర ఆంధ్ర’పై సమావేశం

**కదిరి అర్బన్:** మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ‘అక్షర ఆంధ్ర’ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారి జనార్దన్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

### అవసరం మేరకే వాడాలి

**ఎన్పీకుంట:** రైతులు అవసరం మేరకు పంటలకు ఎరువులు, పురుగుమందులు వాడాలని మండల వ్యవసాయ శాఖ అధికారి లోకేశ్వరరెడ్డి తెలిపారు. ‘క్లస్టర్ డెమాన్‌స్ట్రేషన్’ కింద 125 ఎకరాల్లో మినుము పంట సాగును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని వెలిచలమల, గొకనపల్లి, వంకమద్ది, ధనియానిచెరువు, దిగువతూపల్లి ఐదు క్లస్టర్లలో మినుము పంట సాగుకు సంబంధించి విత్తనశుద్ధి దశ నుంచి పంట కోత వరకు పాటించవలసిన యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు ఇచ్చారు

### బార్లకు దరఖాస్తు చేసుకోండి

**ధర్మవరం అర్బన్:** ప్రభుత్వం ప్రకటించిన నూతన బార్లకు ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని అనంతపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, పుట్టపర్తి అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహులు తెలిపారు. ధర్మవరం ఎక్సైజ్ స్టేషన్‌లో బుధవారం పాత బార్ల లైసెన్స్‌దారులు, ఏ4 షాప్ లైసెన్స్‌దారులు, కొత్తగా బార్లకు అప్లికేషన్‌లు వేయాలనుకునేవారికి నూతన బార్లకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. సమావేశంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమణి పాల్గొన్నారు.

**కదిరి టౌన్:** మద్యం దుకాణ లైసెన్స్‌దారులు, రెస్టారెంట్ లైసెన్స్‌దారులకు బుధవారం కదిరి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ గురించి వివరించారు. మున్సిపాలిటీ పరిధిలో మూడు బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైందని, ఆసక్తిగల వారు లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

### సమయ పాలన పాటించాలి

**తనకల్లు:** గ్రామ సచివాలయాల ఉద్యోగులు సమయ పాలన పాటించాలని ఎంపీడీఓ రామానాయక్ సూచించారు. తనకల్లు 1, 2, 3 సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు రోజూ ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు.

### యువతి అదృశ్యం

**కదిరి టౌన్:** పట్టణంలోని ఓ ఫార్మసీ కంపెనీలో పని చేసే యువతి మంగళవారం విధులకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రామాపురానికి చెందిన పవన్ కళ్యాణ్‌పై అనుమానం ఉన్నట్లు పేర్కొన్నారు.

### అర్హులకు పింఛన్లు పునరుద్ధరించాలి

**పుట్టపర్తి టౌన్:** అర్హత ఉన్నా తొలగింపునకు గురైన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని సీపీఐ నాయకులు ఎంపీడీఓను కోరారు. ఈ మేరకు బుక్కపట్నం ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు వినోద్, మండల కార్యదర్శి షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

### లైసెన్స్ రెన్యూవల్ చేయాలి

**ఎన్పీకుంట:** పేదలకు సేవలందిస్తున్న ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని పలు గ్రామాల ప్రజలు తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఆర్డీటీ సంస్థపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, ఆర్డీటీని సమష్టిగా పోరాడి కాపాడుకోవల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

### ఉద్యమ్ పత్రం కీలకం

**కదిరి అర్బన్:** వ్యాపార, పరిశ్రమల స్థాపనలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పత్రం కీలకమని పరిశ్రమల శాఖ అధికారులు పేర్కొన్నారు. బుధవారం ఖాద్రీ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జిల్లా పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయ ఏఓ రవికుమార్, పరిశ్రమల శాఖ విస్తరణ అధికారులు సంజీవరాజు, దుర్గేష్, ఓబులేసు హాజరై మాట్లాడారు.

### శాంతియుతంగా చేసుకోండి

**ఓడీచెరువు:** వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా చేసుకోవాలని సీఐ మల్లికార్జునరెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. బుధవారం ఓడీచెరువు పోలీస్‌స్టేషన్ ఆవరణలో అన్ని కులాల, మత పెద్దలతో పాటు వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాలు ఏర్పాటుచేసే వారు పాటించాల్సిన నియమనిబంధనలను సీఐ, ఎస్ఐ వివరించారు. ఎంపీపీ తుమ్మల పర్వీన్‌భాను తదితరులుపాల్గొన్నారు.